క్లుప్తంగా

వీరన్న సన్నిధిలో ఎంపీ పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ఎంపీ పోరిక బలరాం నాయక్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అవిరె మోహన్‌రావు, బానోత్ తుకారం నాయక్, గుగులోత్ నవీన్, దైద భద్రయ్య, లక్ష్మణ్‌నాయక్, కొర్ని అనిల్ పాల్గొన్నారు.

యాసంగి బోనస్ చెల్లించాలి

బయ్యారం: రైతులకు బకాయి ఉన్న యాసంగి బోనస్ డబ్బులు చెల్లించాలని బీఆర్ఎస్ మండల నాయకులు ఎనుగుల ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు రెండు పంటలకు బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఒక పంటకే బోనస్ చెల్లించి మరో పంటకు ఎగనామం పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా యాసంగి పంటకు సంబంధించిన బోనస్‌ను రైతులకు చెల్లించాలన్నారు.

కంకర రోడ్లను బీటీగా మార్చాలి

బయ్యారం: మండలంలో కంకరపోసి, వదిలిపెట్టిన రహదారులను బీటీ రోడ్లుగా మార్చాలని పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుడుం వీరభద్రం ప్రభుత్వంను కోరారు. ఆదివారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. మండలంలో పలు రహదారులు సంవత్సరాల క్రితం కంకరపోసి వదలిపెట్టడం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా రహదారులను బీటీ రోడ్లుగా మార్చాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మురళీ, నరేష్, రవి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



దామోదర్, అధ్యక్షుడు

పెద్దవంగర: ఫర్టిలైజర్ అసోసియేషన్ మండల కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దేవసాని దామోదర్, ఉపాధ్యక్షుడిగా మంచిల్ల సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వెంకన్న, సభ్యులుగా గోపాల్, రమేష్, వీరన్న, అనిల్ నియమితులయ్యారు. మండల రైతులకు ఎరువులు, పురుగుల మందులు అందజేసి వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని వారు పేర్కొన్నారు.

శోభాయాత్ర



దంతాలపల్లి: మండలంలోని బీరిశెట్టిగూడెం, పంతులు తండాలో ఆదివారం ఉదయం రేణుకా ఎల్లమ్మ, పోతరాజుల విగ్రహాల శోభాయాత్ర నిర్వహించారు.

పిచ్చి మొక్కలతో దోమల స్వైరవిహారం



ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు

చిన్నగూడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని ఇళ్ల మధ్య ఖాళీగా స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి పందులు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు పంపాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం దృష్ట్యా విషసర్పాలు ఇళ్లలోకి ప్రవేశిస్తుండడంతో భయభ్రాంతులకు గురవుతున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. అంతేకాకుండా ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న మురుగు నీటిలో దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి రోగాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓపెన్ స్థలాల యజమానులకు నోటీసులు పంపి, చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- పంచాయతీల్లో అడుగడుగునా సమస్యలు
- పట్టించుకునే వారు కరువయ్యారు..
- ప్రత్యేకాధికారుల పాలనలో ఇబ్బందులు



పత్తికుంటతండాలో గృహాల మధ్య మురుగు గుంత



బుడ్డతండాలోని బురదమయంగా ఉన్న వీధి

మరిపెడ రూరల్: పల్లెల్లో పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామ పంచాయతీల బాధ్యతలు ఉండడంతో పర్యవేక్షణ ఇబ్బందికరంగా మారింది. గ్రామాల్లో ఏమైన సమస్యలున్నా చెబుదామంటే అధికారులు అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో పారిశుధ్యం పేరుకపోయి పండుగల వేళల్లో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

మరిపెడ మండలంలో ప్రత్యేకాధికారుల పాలనలో పారిశుద్ధ్యం అధ్వానంగా తనయారైంది. గ్రామాల్లో సర్పంచ్‌ల కాలం ముగిసిన నుంచి గ్రామాల్లో సమస్యలు పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. గ్రామాల్లో ఎక్కడ చూసిన చెత్తాచెదారం, మురుగు గుంతలు పేరుకుపోయి ఉన్నాయి. గృహాల మధ్య మురుగు నీరు చేరి దుర్వాసనతో పాటు దోమలు ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో పంచాయతీల్లో నిధులు లేకపోవడతో ప్రత్యేక అధికారులు నామమాత్రంగా పని చేస్తున్నారు. గ్రామాల్లో అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో గ్రామాల్లోని పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.

పర్యవేక్షణ కరువు..

మండలంలోని పల్లెల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు ఉన్నప్పటికీ వారితో పని చేయించే వారు లేరు. సర్పంచులు లేక ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు దెబ్బతిన్నాయి. వీధుల్లో మురుగు నీరు నిలుస్తుంది. వాటర్ ప్లాంట్లు పనిచేయకపోయిన పట్టించుకోవడం లేదు. ఒక్కో గ్రామ కార్యదర్శికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించడంతో వారు ఏ గ్రామంలో ఉంటున్నారో తెలియని అయోమయపరిస్థితి మండలంలో దాపురించింది. ఇప్పటికైన ప్రత్యేకాధికారులు పర్యవేక్షణ చేసి పల్లెల్లో పేరుకపోయిన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మురుగు నీటిని తొలగించాలి



పల్లెల్లో పేరుకుపోయిన చెత్త చెదారంతోపాటు మురుగు నిల్వలు చోటుచేసుకున్నాయి. దీంతో విపరీతమైన దోమలు వ్యాపించడంతో గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి చెత్తా చెదారంతోపాటు మురుగు నీటి నిల్వలు తొలగించాలి.

- జాటోతు మంగీలాల్, అబ్బాయిపాలెం

కాంగ్రెస్‌ను ఓడిస్తేనే 'గ్యారంటీ'లు అమలు



బాకీ కార్డులను విడుదల చేస్తున్న నాయకులు

తొర్రూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తేనే ఆరు గ్యారంటీలు అమలు అవుతాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు అన్నారు. ఆదివారం మండలంలోని గుర్తూరు, నాంచారీమడూరు గ్రామాల్లో పార్టీ ఆధ్వర్యంలో ఎంపీటీసీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించి, ఆరు గ్యారంటీల బాకీ కార్డులను విడుదల చేసి, ఇంటింటికి పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీతారాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అనేక మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిన ఆరుగ్యారంటీలు అమలు చేయలేదని, ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ నిజా స్వరూపాన్ని బయట పెట్టాలన్నారు. ఈసమావేశాల్లో మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, నాయకులు నలమాల ప్రమోద్, కుర్ర శ్రీనివాస్, హనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, మాచర్ల వెంకన్న, మేరుగు ప్రకాష్‌గౌడ్, గుద్దేటి మల్లయ్య, సింగరం కుమార్, ఈదురు వెంకన్న పాల్గొన్నారు.

పాలకవర్గ, ప్రతిపక్ష పార్టీలకు బుద్ధి చెప్పండి



మాట్లాడుతున్న ఐలయ్య

గూడూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు నమ్మకద్రోహం చేస్తున్న పాలకవర్గ, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల కార్యదర్శి గజ్జి లింగన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడుతూ నేడు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడేది ఎన్డీ పార్టీ అన్నారు. కానీ అభివృద్ధి పేరుతో ఒకరు, ఆరు గ్యారంటీలతో అధికార పార్టీ ప్రజలను మభ్యపెడుతూ దోచుకుంటున్నాయని ఆరోపించారు. ఇపుడు మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల్లో మాయమాటలు చెపుతూ వస్తారని, అలాంటి దోపిడీ వర్గ, అవకాశవాద పార్టీలను ఓడించాలన్నారు. ప్రజల పక్షాన నిలబడే సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, అచ్చన్న, జోగ వీరస్వామి, వెంకన్న, రజిత, వజ్జయ్య, సమ్మయ్య, రామనాథం, ఐలయ్య పాల్గొన్నారు.

సీపీఎం శ్రేణులు సమాయత్తం కావాలి



మాట్లాడుతున్న సత్యవతి

గార్ల: స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీపీఎం శ్రేణులు సమాయత్తం కావాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి అలువాల సత్యవతి కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఎం అభ్యర్థులకు ఎన్నికల్లో ప్రజలు మద్దతు తెలిపి అత్యధిక స్థానాలను గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు పెద్దవెంకటేశ్వర్లు, ఇమ్మడి గోవింద్, సత్యం, రాజారావు, బాబు, ఎం.నాగమణి, మౌలానా, రాము, శ్రీను, కొండయ్య, రామయ్య, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

'డబుల్ ఇంజన్ కాదు.. దోపిడీ సర్కారు'



మాట్లాడుతున్న సూర్నపు సోమయ్య

నెహ్రూసెంటర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డబుల్ ఇంజన్ కాదు, దోపిడీ సర్కార్ అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం భూపోరాట కేంద్రంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పోరాటాలు నిర్వహించాలన్నారు. హెచ్‌బీ1 వీసాల పేరుతో ఉద్యోగులు, సుంకాల పేరుతో దేశ ప్రజలను ట్రంప్ ఇబ్బందులకు గురి చేస్తుంటే మోదీ మాత్రం మౌనం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఆర్ఎస్ఎస్‌ను చట్టబద్ధం చేసేందుకు విభజించు పాలించు వలసవాద భావజాలాన్ని ప్రోత్సహించడానికి కేంద్రం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి సీతారాంనాయక్, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

'సీఎంను విమర్శించే స్థాయి లేదు'



మాట్లాడుతున్న రాజశేఖర్

తొర్రూరు: సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పింగిళి ఉషా అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసి, ఎలాంటి అభివృద్ధి పనులు చేయని దయాకర్‌రావు ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై చెడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు గంజి విజయపాల్‌రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, తాళ్లపల్లి భిక్షంగౌడ్, దొంగరి శంకర్, ముద్దసాని సురేష్, కిషన్‌యాదవ్, వెలుగు మహేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

దంతాలపల్లి: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నల్ల తారమ్మ, గ్రామానికి చెందిన పలువురు ఆదివారం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి రెడ్యానాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గీత కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో కల్లు గీత కార్మిక సంఘం కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా భర్తాపురం రమేష్, ఉపాధ్యక్షుడిగా బెల్లంకొండ సుధాకర్, కార్యదర్శిగా బెల్లంకొండ మురళి, కోశాధికారిగా దోమల నవీన్, ప్రత్యేక సలహాదారులుగా భర్తాపురం కొమిరెల్లి, ముత్యం వెంకటేశ్వర్లు, కమిటీ డైరెక్టర్లుగా భర్తాపురం వెంకటేశ్వర్లు, భర్తాపురం వెంకన్న, ముత్యం రంజిత్, భర్తాపురం అశోక్, సూధగాని అక్షయ్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

గార్ల: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు భూక్యా బాబూరావు ఇటీవల మృతి చెందాడు. ఆదివారం విశ్రాంత ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ గంగావత్ రాంసింగ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, క్వింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కొమ్మరాజు జగదీష్, శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ రైతు సంఘం అధ్యక్షుడిగా పోలెపల్లి చెన్నారెడ్డి



కేసముద్రం: అభ్యుదయ కూరగాయలు, పండ్ల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా మున్సిపాలిటీ పరిధి కేసముద్రంవిలేజ్‌కి చెందిన పోలెపల్లి చెన్నారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధి అభ్యుదయ రైతు సంఘం భవనంలో జరిగిన సంఘం 15వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈమేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా బొగ్గుల యాలాద్రి, కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మల్యాల కుమారస్వామి, కోశాధికారిగా ఎలగలబోయిన అనిల్ ఎన్నికయ్యారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ తిర్లాపురం సందీప్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సందీప్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, అనిల్, సునిల్, బాలరాజు, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాతుల జలకాలాట..



మత్తడిలో జలకాలాడుతున్న బాతులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం రాంపురం శివారు ఓ చెరువు మత్తడిలో బాతులు జలకాలాటాడాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంచార జాతుల వారు కొందరు వేలాది బాతు పిల్లలతో ఇక్కడికి వచ్చారు. సమీపంలో బీడు భూమిలో డేరాలు నిర్మించుకున్నారు. బాతు పిల్లలు జలశయాల్లో తిప్పుతు వాటిని సంరక్షిస్తున్నారు. దీంతో బాతు పిల్లలు రాంపురం నుంచి వయా బావోజిగూడెం, మరిపెడ మండలానికి వచ్చే రహదారిలోని చెరువు మత్తడి నీటిలో జలకాలాడుతూ ప్రయాణికులను అలరింపజేశాయి.

బీసీలను మోసం చేస్తున్న సీఎం

- మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యానాయక్

దంతాలపల్లి: రిజర్వేషన్ పేరుతో బీసీలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుభవం లేని సీఎం, ఎమ్మెల్యేల పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. డోర్నకల్ నియోజకవర్గంలో అన్ని జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు బీఆర్ఎస్ పార్టీ గెలువబోతుందని ధీమా వ్యక్తం చేశారు ప్రతి గ్రామంలో పార్టీని గెలిపించడంలో కార్యకర్తలు కీలక బాధ్యతలు తీసుకోవాలని కోరారు. ఎన్నికలకు వెళ్లే ముందు ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డులు తీసుకెళ్లాలని నాయకులకు గుర్తుచేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, నూకల వెంకటేశ్వర రెడ్డి, మల్లారెడ్డి, కిశోర్, వెంకటరెడ్డి, నూకల గౌతంరెడ్డి పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా..

- నలుగురికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

మరిపెడ రూరల్: కుక్కను తప్పించబోయి ఆటో బోల్తాపడి ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలోని 365 జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బావోజిగూడెం గ్రామానికి చెందిన పలువురు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చారు. తిరిగి ఆటోలో స్వగ్రామానికి బయలు దేరి వెళ్తున్నారు. ఈక్రమంలో ఆటో మరిపెడ మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగి కుక్క అడ్డురావడంతో ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందిలో ఆటో డ్రైవర్ దిగజర్ల సుధాకర్‌తోపాటు అజ్మీర పంతులు, దిగజర్ల రామచంద్రు, అజ్మీర బాబిలిలకు తీవ్రగాయాలుకాగా, మరో నాలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. 108వాహనంలో నలుగురికే అవకాశం ఉండడంతో మిగిలిన వారికి 108 సర్వీసు అందకపోవడంతో స్థానిక పీహెచ్‌సీ తరలించినట్లు తెలిపారు.

కుల వివక్ష నిర్మూలనే కేవీపీఎస్ లక్ష్యం



కేసముద్రం: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్/కేసముద్రం: కుల వివక్షకు వ్యతిరేకంగా, వివక్షతను రూపు మాపేందుకు కేవీపీఎస్ పోరాటాలు నిర్వహిస్తుందని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చీపిరు యాకయ్య, దుడ్డెల రాంమూర్తి ఆదివారం తెలిపారు. సంఘం ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పత్తిపాకలో జెండాను మందుల మహేందర్ ఎగురవేసి వేడుకలను ఆదివారం నిర్వహించారు. కుల, ఆర్థిక అసమానతలను అంతం చేసేందుకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గొర్రె రవి, నర్సింహారావు, మందుల మహేందర్, నాగరాజు, వెంకటేష్, నరేష్, మధు, సాగర్, సాయి, వెంకన్న, ఎల్లయ్య, గణేష్, భిక్షపతి పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ మహేందర్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్: ఓ వ్యాపారంలో పెట్టుబడి పెట్టించి మోసం చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించామని మహబూబాబాద్ టౌన్ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. టౌన్ సీఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణ పరిధిలోని ఓ బాధితురాలికి మాయమాటలు చెప్పి బత్తుల రవికిరణ్ అనే వ్యక్తి తన వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించాడన్నారు. ఆ యువతి చేత సుమారు రూ.6లక్షల వరకు పెట్టుబడి పెట్టించి మోసం చేయగా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశామని తెలిపారు. పట్టణంలోని పత్తిపాక ప్రాంతంలో గల అతడి కార్యాలయం వద్ద అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించామని పేర్కొన్నారు. చైన్ మార్కెటింగ్ వ్యాపారాలు చేస్తే అధిక డబ్బులు ఇస్తామని ప్రజలను మోసం చేసే వ్యక్తులను నమ్మవద్దని సూచించారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్సైలు అశోక్, మౌనిక పాల్గొన్నారు.

పని చేయని సిగ్నళ్లు



నెహ్రూసెంటర్ వద్ద నిరుపయోగంగా మారిన సిగ్నళ్లు

మహబూబాబాద్ రూరల్: ట్రాఫిక్, వాహనాల రద్దీ నియంత్రణ చర్యల్లో భాగంగా పట్టణంలోని నెహ్రూసెంటర్, మదర్ థెరిస్సా సెంటర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. చాలా రోజులుగా సిగ్నళ్లను పట్టించుకోకుండా అలాగే వదిలేశారు. దీంతో ట్రాఫిక్ సిగ్నళ్లకు ఏర్పాటు చేసిన లైట్ల పరికరాలు ఒక్కొక్కటిగా శిథిలమైపోతూ పనికిరాకుండా తయారవుతున్నాయి. వాటికి అమర్చిన విద్యుత్ పరికరాలు కూడా తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి.

శిథిలావస్థలో పాఠశాల, కళాశాల భవనాలు



శిథిలావస్థలో ఉన్న పాఠశాల, కళాశాల భవనాలు

నెల్లికుదురు: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేల మందికి 60ఏళ్లపాటు విద్యాభివృద్ధి కోసం వినియోగించిన తరగతి గదులు ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆ భవనాలను వదిలేసి ఎనిమిదేళ్లుగా నూతన భవనాల్లో విద్యను కొనసాగిస్తున్నారు. దీంతో పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని పట్టించుకునే వారు లేరు. టేకుకర్రతో నిర్మించిన భవనాల పైకప్పు తడిసి ధ్వంసం అవుతున్నాయి. సామాజిక కార్యకర్తలు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.